సుంటే నేనల్లాగన్నాను. కాని, యింత తొందరగా నీలో మార్పు వస్తుందని నేననుకోలేదు" అన్నాడు రామం చిరునవ్వుతో.

"కాదు రామం! నన్ను క్షమించవూ! లేకపోతే నేనూ—" అంటూ లేవబోయింది.

"అబ్బే! యింత రాద్ధాంతం చేస్తావనుకోలేదు సుమా" రామానికి యింక నవ్వాగలేదు.

ఏమిటిదంతా తమాషానా! తన గర్వం తనకి తెలియ చేయడానికి చేసిందా! తను గ్రహించుకోలేకపోయింది. ఎంత సిగ్గు. తననీడ చూసి తనే భయపడింది. పోనీ యిప్పటికైనా తెలుసుకుంది. లేకపోతే యింకా ఎంత బాధ పడేదో. మబ్బులా వచ్చి మంచులా పోయింది.

"ఏమిట్రా, ఎవరూ వస్తా" అంటూ కళ్ళు నులుముకుంటూ వచ్చింది రామం తల్లి.

"ఇలారా, గీతా! అమ్మకి నమస్కారం పెడదాం" చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళాడు రామం. ఇద్దరూ ఒకేసారి ఆవిడ కాళ్ళకి నమస్కారం పెట్టారు.

"ఏమిటిరా నాయనా" అంటూ తెల్లబోయిందావిడ.

"కాదమ్మా, ఈవిడే నీ కాబోయేకోడలు" అన్నాడు రామం.

"ఆరి నీయిల్లు బంగారం కానూ! మొదటే చెప్పకూడదురా నాయనా. ఏమని దీవించను. ధన ధాన్యాలతో, కొడుకూ కోడళ్ళతో వెయ్యేళ్ళు బ్రతకండి ఇద్దరూ." అంది రామం తల్లి వాత్సల్యంతో.

స్కెచ్

# సుందరం ఉద్యోగం

ఆర్. యం. చిదంబరం

సుందరం యోచించాడు. దేశంలో ఏ మూల చూచినా ఆకలి మంటలు. ఎక్కడ చూచినా నిరాశతో కూడిన నిట్టూర్పులు. అంతా అంధకారమయం. నేటి ప్రజలకు మార్గం చూపే వెలుతురు శూన్యం. దీనికంతా కారణం? "ప్రభుత్వం" అనుకున్నాడు సుందరం. ప్రభుత్వమంటే ఎవరు? ప్రజలేగా. సుందరం అప్రయత్నంగా వార్తాపత్రికలో ఒక ప్రకటన చదివాడు.

"ఇక్కడకు ఎనిమిది మైళ్ళదూరంలో ఉన్న ఒక గ్రామానికి ఒక వర్తకుడు తీసుకుపోతున్న వంద బస్తాల బియ్యాన్ని ప్రభుత్వపు ఉద్యోగులు పట్టుకున్నారు. దీనినంతా ప్రజల కిచ్చే నిమిత్తం రేషన్ డిపోలకు చేర్చబడింది. సుందరం మళ్ళా తన ఆలోచన ప్రారంభించాడు. అయితే వర్తకుడంత వెర్రివాడా! వంద బస్తాల బియ్యాన్ని వదిలేసుకున్నాడా? పాపం! ఆ బియ్యాన్నమ్ముకుంటే అతనికెంత లాభం వచ్చేది! అదంతా పోగొట్టుకున్నాడు....అబ్బే! అన్ని కోర్కెలను తీర్చే ఔషధముండగా నష్టపడటమెందుకు? వర్తకుడికి లంచాలతో సర్వము సాధింపవచ్చునని తెలియదా? ఏమో!"

మరునాడు వార్తా పత్రికలో చదివాడు సుందరం:

"ఈ గ్రామంలో నేటినుండి బియ్యం రేషను రెండౌన్సులు తగ్గింపబడింది. బియ్యం నిలవ లేకపోవటంవల్ల ఈ మార్పు చేయవలసి వచ్చిందని తెలుస్తూంది."

సుందరం తెల్లబోయాడు. ఏ గ్రామంలోని రేషను డిపోకయితే వర్తకుని వద్దనుండి తీసి కొన్న వందబస్తాల బియ్యం ప్రజోపయోగ నిమిత్త మీయబడిందో ఆ గ్రామంలో నే బియ్యం రేషను రెండౌన్సులు తగ్గింపు! బియ్యం నిలవ లేకపోయిందట. చాలా వింతగా ఉందే! అయితే కంచే చేనుమేస్తోందన్నమాటే. వీథిలో నుండి అరుపు:

"బాబూ! మూడు రోజులనుండి తిండిలేదు. పట్టెడన్నముంటే పెట్టు బాబూ."

సుందరం వెంటనే ఇల్లంతా బియ్యంకోసం వెదకాడు. కాని ఫలితం శూన్యం.

"అటు వెళ్ళు బాబూ, ఇక్కడ నాకే తిండికి లేదు."

"పోలీసు ఉద్యోగంలో చేరే వాళ్ళందర్నీ చేర్చుకుంటున్నారు. వెళ్ళవలసిన వాళ్ళంతా పోలీసు స్టేషనుకు వెళ్ళండహో..."

సుందరం చాటింపు విన్నాడు. "అవును పోలీసు ఉద్యోగంలో చేరితే ప్రభుత్వ శాసనాలు కొన్ని సరిగా జరిగేటట్టు చూడవచ్చు. ముఖ్యంగా దొంగతనంగా బియ్యం పట్టుకు పోయేవారిని పట్టొచ్చు. బాగుంది, ఇంతకంటే తనేం చెయులేడు." సుందరం పోలీసు స్టేషనుకు పరుగెత్తాడు.

*　　*　　*

సుందరం ఇప్పుడు పోలీసు. సైకిలుకు బెల్లు లేకుండా పోయేవారిని పట్టుకోవటం లేదు. తిండికి మొహంవాచి, మైళ్ళకొలదీ బండి లాగి సగం కడుపుకూడా నింపుకోలేని రిక్షావాడిని నిర్బంధించి వాడి బండికి దీపంలేదని పావలా, అర్థా గుంజటం లేదు. ధనమదంతో కన్నూ మిన్నూ తెలియకుండా పేద ప్రజానీకాన్ని పీడించే ధనవంతుల నేరాలకోసం వెయ్యి కళ్ళతో కాచుకు కూర్చున్నాడు. రోజుకు కనీసం ఒక్క కేసైనా తీసుకురావటం లేదని సుందరాన్ని పై అధికారి చీవాట్లు పెడుతున్నాడు. కాని సుందరం ఆమాటలను పట్టించుకోవటం లేదు. బియ్యం దొరక్క నల్లబజారులో రెండు శేర్ల బియ్యం కొనుక్కుపోయే రిక్షావాడినా పట్టుకోవటం?

సుందరానికానాడు రాత్రిపని పడింది. సంత చెరువుదగ్గర నిలబడున్నాడు. బరువును మోయలేక మోయలేక బక్కచిక్కిన యెడ్లు బండిని లాక్కుపోతున్నాయి. సుందరం గమనించాడు. "ఏయ్! బండి ఆపు" అన్నాడు. బండి దాని త్రోవ నది పోతోంది.

"బండాపు" గట్టిగా అరిచి విజిల్ కొట్టాడు సుందరం. బండి ఆగింది.

"బండిలో ఏమిటి తీసుకుపోతున్నావు? బియ్యం బస్తాలేనా?" గర్జించాడు సుందరం.

"అవునండి" నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు బండివాడు.

"ఎవరికి?"

"వెంకటరత్నంగారికి"

వెంకటరత్నమనేసరికి సుందరం తగ్గాడు. వెంకటరత్నమంటే ఆ ఊరికేగాక చుట్టుప్రక్కలున్న గ్రామాలన్నిటికీ లక్షాధికారి. ఆయనకున్న పలుకుబడి ఇంతా అంతా కాదు ఆయన చేతిలోనే అధికారులంతా ఉంటారు.

"పెర్మిట్టేది?" సుందరం ప్రశ్నించాడు.

"ఆయనదగ్గరే ఉన్నాయి బాబూ! తమరు వెంకటరత్నంగారి నెరగరండీ?"

"అవంతా నీ కెందుకు? ముందు బండిని స్టేషనుకు తిప్పు. పెర్మిట్టు లేకుండా బియ్యం తీసుకుపోకూడదని తెలియదూ?"

బండివాడాశ్చర్యపోయాడు. వెంకటరత్నంగారికి బియ్యం తీసుకుపోతుంటే వీలులేదనే మొనగాడెవడు? ఇంతకీ వీడు పోలీసు. పై యధికారులే ఆయన చేతిలో కీలుబొమ్మలు.

"అలాగే బాబు. కాని అనక కష్టపడతారు. పెర్మిట్టు ఆయనదగ్గరుంటుంది. ఇది మామూలేనండి. తమరు కొత్తగా వచ్చినట్టున్నారు" అన్నాడు బండివాడు.

ఇంతలో పై అధికారి ఆత్రోవన పోతూ ఆగాడు. "ఏమిటది?" అన్నాడు.

"వెంకటరత్నానికి పెర్మిటు లేకుండా బియ్యం తీసుకుపోతున్నాడు" అన్నాడు సుందరం.

"ఎవరికీ? వెంకటరత్నంగారికా? అవును పాపం! ఆయన బియ్యంలేక చాలా అవస్థపడుతున్నారట. మొన్ననే నాతో చెప్పారు. పర్మిటు ఆయనదగ్గరుంటుందిలే. ఫరవాలేదు" అన్నాడధికారి.

"అదికాదండి. అసలు చట్టప్రకారం పెర్మిట్టు లేకుండా బియ్యం తీసుకుపోకూడదు. కనుక ఇప్పుడీ బండిని పోనివ్వకూడదు. పెర్మిటు ఉంటే ఆయన స్టేషనుకువచ్చి బియ్యం తీసుకుపోనీయండి" అన్నాడు సుందరం.

"ఆయనలాగ చట్టానికి వ్యతిరేకంగా నడవడయ్యా. నీకు మహా తెలుసునులే. ఏయ్ బండి పోనీవయ్యా" అని అధికారి సైకిలెక్కిపోయాడు. దేశంలో అరాజక మెందుకు వీరవిహారం సల్పుతోందో సుందరానికర్థమయింది.

మరునాడు సుందరంచేతికి తన ఉద్యోగం ఊడిపోయినట్లుగా కాగితం వచ్చింది. అతను తన బాధ్యతను సవ్యంగా నిర్వర్తింపకపోవటమే దానికి కారణమని ఆ పత్రంలో తెలుపబడింది.